క్లుప్తంగా

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం



కలెక్టర్‌ను కలిసిన ఏడీ పద్మజ

కడప సెవెన్‌రోడ్స్‌: జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా సమాచార పౌర సంబంధాల సహాయ సంచాలకులు పద్మజ అన్నారు. కడప క్యాంపు కార్యాలయంలో కలెక్టర్‌ శ్రీధర్‌ చెరుకూరిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను మీడియా ద్వారా ప్రజలకు తెలియజేస్తామని తెలిపారు.

కరుణించు...విజయదుర్గ!



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్‌: ఆపదలో ఆదుకునే విజయదుర్గమ్మ సన్నిధిలో పూజలు నిర్వహించేందుకు భక్తులు మంగళవారం విశేష సంఖ్యలో తరలివచ్చారు. కడప విజయదుర్గాదేవి ఆలయంలో దోషాల నివారణకు రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి సన్నిధిలో తొమ్మిది రకాల విశేష కలశాలను ఉంచి పూజలు జరిపారు. అనంరం మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేసి.. సామూహికంగా రాహుకాల పూజలు నిర్వహించారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు. సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్‌ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

చిన్నారులతో సహపంక్తి భోజనం



అన్నదాన కార్యక్రమంలో విద్యార్థులు, దాతలు

కడప కల్చరల్‌: కడప నగరంలోని గ్లోరీ సెక్యూరిటీ ఏజెన్సీ అధినేత అయ్యూరి మునెయ్య తన కుమార్తె జన్మదినం సందర్భంగా అనాథ బాలలతో కలిసి మంగళవారం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్‌ మాట్లాడుతూ అనాథ బాలల మధ్య జన్మదిన వేడుక నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కల్లాకపటం ఎరుగని బాలలు జీవితాంతం ఆనందంగా గడిపేలా పెద్దలు ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునెయ్య యశోద, మద్దూరి మోహన్‌, ఏలూరి ప్రభుదాస్‌, మనోహర్‌, మధు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య పుష్టి



యోగాసనాలు వేయిస్తున్న అధ్యాపకులు

కడప ఎడ్యుకేషన్‌: యోగ చేయడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పుష్టి సమకూరుతుందని ప్రభుత్వ బాలికల జూనియర్‌ కళాశాల ప్రిన్సిపల్‌ జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కడప పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్‌ కళాశాల విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. జ్ఞానేశ్వరి మాట్లాడుతూ యోగ ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాజారావు, సుధాకర్‌రెడ్డి, శ్రీరాములురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

చింతకొమ్మదిన్నె : రైతులు పంటల సాగులో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విదానాలను అనుసరించాలని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు చంద్రనాయక్‌ పిలుపునిచ్చారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని అప్పరాజుపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొలం పిలుస్తుంది కార్యక్రమం ప్రతి మంగళ, బుధ వారాల్లో నిర్వహిస్తామన్నారు. భూసార పరీక్షలకు ఆధారంగా రైతులు సూక్ష్మ పోషకాలు వాడి దిగుబడి పెంపొందించుకోవాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా వ్యవసాయ డ్రోన్లు 80 శాతం సబ్సిడీతో ఇవ్వడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతు సోదరులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టల వాడకము, కషాయాల తయారీ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈశ్వరరెడ్డి, ఎంపిఏఓ శ్రీధర్‌రెడ్డి రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి సురేష్‌, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నగరం..పుష్ప సోయగం

రంగురంగుల పూలు...హంగులు కలిసిన పూలు..ఒక్కొక్క తీరు ఆకట్టుకున్న వర్ణాలు...కళ్ల ప్రక్కకు తిప్పుకోలేని మైమరిపించే దోబూచులు...ఒక్కటా, రెండా మనసును కట్టి పడేసి రంగులన్నీ ఒక్కచోట గుబులురేపుతున్న దృశ్యాలు. .కడప మహావీర్‌ సర్కిల్‌ నుంచి రిమ్స్‌కు వెళ్లే దారిలో ప్రజలను విశేషంగా ఆకర్షిస్తున్న వివిధ రకాల పూల మొక్కలు ఇవీ..

– సాక్షి ఫొటోగ్రాఫర్, కడప













పీఎం సూర్య ఘర్‌ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వల్లూరు (చెన్నూరు) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పీఎం సూర్య ఘర్‌ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ ఆపరేషన్‌ హరి సేవ్యా నాయక్‌ పిలుపునిచ్చారు. మంగళవారం చెన్నూరు 33/11 కేవీ ఉప కేంద్రం ఆవరణలో చెన్నూరు, వల్లూరు మండలాలకు సంబంధించిన విద్యుత్‌ సిబ్బంది, వినియోగదారులతో పీఎం సూర్య ఘర్‌ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్‌ విద్యుత్‌ వినియోగం యొక్క ఆవశ్యకతను వినియోగదారులకు వివరించారు. సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీరు వెంకటేశ్వర్లు, రూరల్‌–2 అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్లు లావణ్య, జూనియర్‌ ఇంజనీర్లు సోలార్‌ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



చాన్‌బాషా చిత్రపటం వద్ద నాయకుల నివాళి

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: సామాజిక సేవకుడు చాన్‌బాషాను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, వక్ఫ్‌ పరిరక్షణ జేఏసీ జిల్లా కన్వీనర్‌ అహ్మద్‌బాబుబాయ్‌, కాంగ్రెస్‌ పార్టీ నగర మాజీ అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్‌, ఆప్‌ కి ఆవాజ్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్‌ ఆరిఫ్‌ ఖాన్‌, షేక్‌ మక్బూల్‌ బాషా డిమాండ్‌ చేశారు. నగరంలోని అజ్మత్‌ కళ్యాణ మండపంలో మంగళవారం చాన్‌బాషా సంతాపసభ నిర్వహించారు. ముందుగా వివిధ ప్రజా సంఘాల నాయకులు చాన్‌బాషా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 1న నగరంలోని అశోక్‌నగర్‌లో చాన్‌బాషాను బంధువులే కిరాతకంగా హత్య చేశారన్నారు. సంపాదించిన దాంట్లో కొంత మొత్తంతో సేవా కార్యక్రమాలు నిర్వహించాడన్నారు. రంజాన్‌ సందర్భంగా వందల మందికి తోఫా పంపిణీ చేశారన్నారు. మతగురువు మౌలానా జాకీర్‌ హుస్సేన్‌ ముక్తి రహిముల్లా ఖాన్‌, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్‌ గోపాల్‌, ఎంఆర్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు దస్తగిరి మాట్లాడుతూ సమాజంలో చాన్‌బాషా లేకపోయినా ఆయన చేసిన మంచి పనులు గుర్తు చేసుకుంటూ ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్‌ కీ ఆవాజ్‌ జిల్లా అధ్యక్షుడు షాజహాన్‌, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు చాపల సుబ్బరాయుడుచ, ప్రసాద్‌, లక్ష్మీదేవి, రిజ్వాన పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి



మాట్లాడుతున్న సుబ్బరాయుడు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: చాలీచాలని వేతనాలతో బతుకు నెట్టుకొస్తున్న ఔట్‌ సోర్సింగ్‌ ఇంజనీరింగ్‌, ఇతర విభాగాల కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. నగరంలోని హోచిమిన్‌ భవన్‌లో మంగళవారం జరిగిన మున్సిపల్‌ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని జూన్‌ 2న మంత్రి నారాయణ హామీ ఇచ్చారన్నారు. ఇపుడు సంక్షేమ పథకాలు కోత విధించారని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్‌, నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ కడప కార్పొరేషన్‌లో 400మంది డైలీ వెజ్‌ వర్కర్లు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో వారు కనపడడం లేదన్నారు. కలెక్టరేట్‌లో ఆమోదించిన మేరకు రోజువారీ రూ.570 రూపాయల వేతనం సత్వరమే ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. పరికరాల కొరత తీర్చాలని, ఫుల్‌ టైమ్‌ పనులు చేయిస్తూ.. రూ.4 వేలు వేతనం ఇవ్వడమేమిటని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో కే.సి.బాదుల్లా, నరసింహులు, మద్దిలేటి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

గయోపాఖ్యానంతో చిలకమర్తికి చిరకీర్తి



నివాళులర్పిస్తున్న మల్లికార్జునరెడ్డి, తదితరులు

కడప కల్చరల్‌: చిలకమర్తి లక్ష్మీనరసింహం రచనలు ఆయనకు గొప్ప కీర్తి తెచ్చిపెట్టాయని వైఎస్సార్‌ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి అన్నారు. చిలకమర్తి వర్ధంతి సందర్భంగా కడపలోని కల్చరల్‌ క్లబ్‌లో మంగళవారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రసిద్ధమైన తెలుగు నాటకాలలో ఒకటైన గయోపాఖ్యానం చిలకమర్తికి శాశ్వతమైన కీర్తి ఆర్జించి పెట్టిందన్నారు. కవిగా, రచయితగా, ప్రసిద్ధ నాటక కర్తగా, సంఘ సంస్కరణ వాదిగా, విద్యావేత్తగా ఆయన చేసిన కృషికి ఆంధ్ర విశ్వవిద్యాలయం ×కళా ప్రపూర్ణ ׀బిరుదుతో సత్కరించిందని తెలిపారు. కవి డాక్టర్‌ వెల్లాల వెంకటేశ్వరాచారి ప్రసంగిస్తూ ఆయనకు పేరు తెచ్చి పెట్టిన నాటకాలతో జనంలో నిలిచిపోయాయని అభివర్ణించారు. జీవకళ సత్యనారాయణ మాట్లాడుతూ చిలకమర్తికి అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉండేదన్నారు. ఈ సందర్భంగా రచయితల సంఘం వారు చీమలపెంట గ్రామానికి చెందిన ప్రసిద్ధ రంగస్థల నటులు పుల్లాసి గుర్రప్పను సత్కరించారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారులు ప్రకాశం, బ్యాంక్‌ గంగయ్య, ఎంపీఎస్‌ సత్యనారాయణ, బాల గంగయ్య, సాహితి మిత్రులు కొత్తపల్లి రామాంజనేయులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయానికి బార్లు మూసివేయాలి



మద్యాన్ని పరిశీలిస్తున్న సీఐ కృష్ణకుమార్‌

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: కడప నగరంలోని ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి బార్లు మూసివేయాలని కడప ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ సీఐ బి.కృష్ణకుమార్‌ అన్నారు. నగరంలోని పలు బార్లలో మంగళవారం ఆయనర ఆకస్మిక తనిఖీలు చేసి, శాంపిల్స్‌ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బార్ల యజమానులకు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే వ్యాపారం చేయాలన్నారు. ఏవైనా అవకతవకలు పాల్పడితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామన్నారు. బ్రాందీ షాపులలో ఉదయాన్నే మద్యం అమ్మకాలపై కానిస్టేబుల్స్‌ పెట్రోలింగ్‌ డ్యూటీకి పంపి నిఘా పెట్టడం జరిగిందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అన్నమయ్య జిల్లా కోడూరు స్టేషన్‌ పరిధిలో నమోదైన స్పిరిట్‌, ఫేక్‌ క్యాప్స్‌ కేసులో అరెస్టు కావలసిన స్మగ్లర్‌ను చాకచక్యంగా అరెస్ట్‌ చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



మొక్క నాటుతున్న రీజనల్‌ మేనేజర్‌ వైద్యలింగం

కడప కల్చరల్‌: మొక్కలు పెంచడం అందరూ బాధ్యతగా స్వీకరించాలని ఎల్‌ఐసీ సౌత్‌ సెంట్రల్‌ జోన్‌ (హైదరాబాద్‌) రీజనల్‌ మేనేజర్‌ పీజీ కుమార వైద్య లింగం అన్నారు. స్థానిక ఎల్‌ఐసీ డివిజనల్‌ కార్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య లింగం మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఈఎస్‌జీ పాలసీలో పర్యావరణ సమతుల్యత కాపాడం ఒక ముఖ్యమైన బాధ్యత అన్నారు. ఈ బాధ్యతను నిర్వర్తించడంలో ఎల్‌ఐసీ అగ్రశ్రేణిలో ఉందని, ×ప్లాంట్‌ ఏ లైఫ్‌ × పేరుతో విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ ఏడాది 46 డిగ్రీల సెంటిగ్రేడ్‌ వరకు ఉష్ణోగ్రత పెరగడానికి కార్బన్‌ ఉద్గారాలే కారణమని అన్నారు. సీనియర్‌ డివిజనల్‌ మేనేజర్‌ జీకేఆర్‌వీ.రవికుమార్‌ మాట్లాడుతూ కడప డివిజన్‌ ఈఎస్‌జీ అమలులో గట్టిగా పని చేస్తోందన్నారు. సత్యప్రసాద్‌, రమణ, మహేశ్వర్‌ రెడ్డి, సుధ పాల్గొన్నారు.

వైఎస్‌ జగన్‌కు సమస్యల విన్నపం

కడప కార్పొరేషన్‌: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ ఎస్సీ విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు సీహెచ్‌ వినోద్‌ కుమార్‌, మైనార్టీ నాయకుడు షఫీవుల్లా, నగర ఎగ్జిక్యూటివ్‌ మెంబర్‌ నరసింహకుమార్‌ మంగళవారం కలిశారు. విజయవాడలోని తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వారు వైఎస్‌ జగన్‌ను కలిసి జిల్లాలో సమస్యలను విన్నవించారు.

సర్వసభ్య సమావేశాన్ని సజావుగా జరగనీయండి

- పన్నుల భారంతో విలవిలలాడుతున్నారు
- అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి
- కమిషనర్‌ నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల డిమాండ్‌



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు

కడప కార్పొరేషన్‌: కడప నగరపాలక సంస్థలో ఈ నెల 20న నిర్వహించే సర్వసభ్య సమావేశాన్ని సజావుగా జరిగేలా అధికార యంత్రాంగం, పోలీసులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్‌ పాకా సురేష్‌కుమార్‌ కోరారు. స్థానిక కార్పొరేషన్‌ కార్యాలయంలోని మేయర్‌ ఛాంబర్‌లో కార్పొరేటర్లు మగ్బూల్‌బాషా, కె. బాబు, బాలస్వామిరెడ్డి, ఎస్‌ఏ షంషీర్‌, శివకోటిరెడ్డి, జహీర్‌, రామలక్ష్మణ్‌రెడ్డిలతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. కొన్ని మాసాలుగా కార్పొరేషన్‌లో జరుగుతున్న పరిణామాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్వహించిన మొదటి సమావేశంలో ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చ జరిగిందని, నగరాభివృద్ధికి కలిసిమెలసి పనిచేద్దామని ఎమ్మెల్యే మాధవి పిలుపునిచ్చారన్నారు. ఆ తర్వాత జరిగిన రెండు సర్వసభ్య సమావేశాలు సజావుగా జరగలేదని, మేయర్‌ ఇంటిపై చెత్త వేయడం, ప్రొటోకాల్‌ రగడ, టీడీపీ నాయకుల గందరగోళం కారణాలతోప్రజావసరాలు ప్రక్కదారి పట్టాయన్నారు. కార్పొరేషన్‌లో తాము చేసిన తీర్మానాలను స్టాండింగ్‌ కౌన్సిల్‌ వద్దకు వెళ్లి ఆమోదించుకోవాల్సిన అగత్యం ఏర్పడిందన్నారు. కమిషనర్‌, అడిషనల్‌ కమిషనర్‌ తమను ప్రశ్నించేవారే లేరని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పన్నులు పెంచి ప్రజలపై అధిక భారం వేశారని, గతంలో రూ.2 వేలు వస్తున్న వారికి ఇపుడు రూ.20వేలు వచ్చిందన్నారు. పెంచిన పన్నులను వసూలు చేయవద్దని తాము తీర్మానించినా అధికారులు కొళాయి కనెక్షన్లు తీసేస్తామంటూ సీజ్‌ నోటీసులిచ్చి భయపెడుతున్నారని తెలిపారు. సర్వసభ్య సమావేశంలో సమస్యలను ప్రస్తావించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ కార్పొరేటర్లు ప్రజాపక్షమేనని, సమస్యల పరిష్కారానికి, నగరాభివృద్ధికి మేయర్‌, ఎమ్మెల్యే కలిసికట్టుగా పోరాటంచేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి బసవరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కడప కార్పొరేషన్‌కు నయాపైసా నిధులు విడుదల చేయలేదన్నారు. పైగా జనరల్‌ ఫండ్‌ నిధులను వాడుకుంటూ కార్పొరేషన్‌కు నష్టం కలిగిస్తున్నారన్నారు.

సెక్రటరీ వద్ద ఉండాల్సిన కౌన్సిల్‌ హాల్‌ తాళాలను తన వద్ద ఉంచుకుని, హాలు తెరవాలని మేయర్‌ లేఖ ఇచ్చినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 2025–26 బడ్జెట్‌కు స్టాండింగ్‌ కమిటీ ఆమోదం లభించినా, కౌన్సిల్‌ ఆమోదం లభించలేదని జీతాలు పెండింగ్‌లో పెట్టారన్నారు. మహానాడు కోసం జనరల్‌ ఫండ్‌ను యథేచ్ఛగా వాడుకున్నారన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్‌ విభాగం సంయుక్త కార్యదర్శి శ్రీరంజన్‌రెడ్డి, డివిజన్‌ ఇన్‌చార్జులు ఐస్‌క్రీం రవి, సుబ్బరాయుడు, ఎన్‌. ప్రసాద్‌రెడ్డి, జిలాన్‌, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కడప కోటిరెడ్డిసర్కిల్‌: కడప ఫాతిమా మెడికల్‌ కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో నంది మండల కేంద్రంలోని చావిడి వద్ద మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు జనరల్‌ మెడిసిన్‌, జనరల్‌ సర్జరీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్‌, పీడియాట్రిక్స్‌, ఈఎన్‌టీ, ఊపిరితిత్తులు, దంత, చర్మ వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ ఏ అనారోగ్య సమస్య ఉన్నా త్వరితగతిన గుర్తిస్తే త్వరగా నయం చేసుకోవచ్చన్నారు. ఆయా వ్యాధులకు సంబంధిత వైద్యులను సంప్రదించడం ద్వారా సరైన వైద్య సేవలు అందుతాయన్నారు. తమ ఆస్పత్రిలో అందుతున్న వివిధ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటంలో వైరల్‌ ఫీవర్‌

సిద్దవటం : మండల కేంద్రం పరిధి పోలీసు లైన్‌ సమీపంలోని వీధిలో వైరల్‌ ఫీవర్‌ రావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. పి.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్‌ రంగలక్ష్మి, మలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి ఇండ్లు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో బుధవారం మలేరియా వ్యతిరేక నివారణ వారోత్సవాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు దోమల నివారణకు ఇంటింటా స్ప్రేయింగ్‌ చేయించి మురుగు నీరు ఉన్న ప్రాంతాల్లో నీటిని తొలగించి బ్లీచింగ్‌ చల్లించారు. అంతేగాకుండా పాత టైర్లలో, కూలర్‌లలో నీరు నిల్వ ఉండటంతో వాటిని తొలగించి అబెట్‌ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. అనంతరం మలేరియా సబ్‌ యూనిట్‌ అధికారి సుబ్బరాయుడు మాట్లాడుతూ ఈ మలేరియా జూలై నుంచి నవంబర్‌ వరకు జ్వరాలు ఎక్కువగా రావడం జరుగుతుందన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా దోమలు ఎక్కువగా అభివృద్ధి చెందుతాయన్నారు. పూల కుండీలు, పాత టైర్లు, డిస్‌పోజల్‌ గ్లాసులు, పాత డబ్బాలలో వ్యర్థాలతో కూడి మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పి.కొత్తపల్లె పీహెచ్‌సీ సీహెచ్‌ఓ లక్ష్మీనరసమ్మ, సూపర్‌వైజర్లు పద్మావతి, మౌలాలి, ఏఎన్‌ఎం శారద, , ప్రజలు పాల్గొన్నారు.

రిమ్స్‌ సూపరింటెండెంట్‌గా బాధ్యతల స్వీకరణ



వెంకటేశ్వరరావుకు స్వాగతం పలుకుతున్న రిమ్స్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ జమున

కడప అర్బన్‌: కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్‌) సూపరింటెండెంట్‌గా ఆడిషనల్‌ డీఎంఈ హోదాలో డాక్టర్‌ కెఎస్‌ఎస్‌.వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జీజీహెచ్‌ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావు కడపకు బదిలీ అయ్యారు. మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు రిమ్స్‌ మునుపటి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పెంచలయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ జమున, అడ్మినిస్ట్రేటర్‌ డిప్యూటీ కలెక్టర్‌ రంగస్వామి, సీఎస్‌ఆర్‌ఎంఓలు డాక్టర్‌ వై.శ్రీనివాసులు, డాక్టర్‌ రాజేశ్వరి డిప్యూటీ ఆర్‌ఎంవోలు డాక్టర్‌ గీత, డాక్టర్‌ సునీత, రిమ్స్‌ కాంట్రాక్టర్‌ బాలనారాయణ రెడ్డి, వైద్య సిబ్బంది ఘన స్వాగతం పలికారు. పూల బొకెలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ వేంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాల రిమ్స్‌ అభివృద్ధికి అందరి సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. వైద్య విద్యార్థులకు తన వంతుగా సేవం దిస్తానన్నారు.

విద్యా సామగ్రి విక్రయాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న ఆర్‌ఎస్‌ఓ నాయకులు

కడప ఎడ్యుకేషన్‌: జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్‌, ప్రైవేట్‌ పాఠశాలల్లో పుస్తకాలు, యూనిఫామ్‌, షూ, బ్యాగ్‌ తదితర వస్తువుల అమ్మకాలను నియంత్రించాలని రాయలసీమ స్టూడెంట్స్‌ ఆర్గనైజేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌ డిమాండ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటుగా ముద్రించిన పుస్తకాలు, యూనిఫామ్‌, బ్యాగ్‌, నోట్‌బుక్స్‌ సామాగ్రిని స్కూళ్లలో అంగడి పెట్టుకుని మరీ ఇష్టం వచ్చిన రీతిలో అమ్ముతున్నారని ఆరోపించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజు కట్టడం, పుస్తకాలు కొనడం భారంగా మారిందన్నారు. జిల్లా, మండల విద్యా శాఖ అధికారులు ప్రైవేట్‌ పాఠశాలలను తనిఖీ చేసిన దాఖలాలు లేవన్నారు. లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటూ ఆఫీసులకే పరిమితమైన విద్యార్థుల సమస్యలు పట్టించుకోకుండా తెలియనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్‌ఎస్‌ఓ నాయకులు పాల్గొన్నారు.

విద్యకు పేదరికం అడ్డుకాకూడదు



పుస్తకాలు ఇస్తున్న ఖాదర్‌బాషా, శ్రీనివాసులురెడ్డి

కడప ఎడ్యుకేషన్‌: విద్యకు పేదరికం అడ్డురాకూడదని విద్యా సాంస్కృతిక క్రీడాభివృద్ధి రాష్ట్ర అధ్యక్షుడు లయన్‌ పఠాన్‌ ఖాదర్‌బాషా అన్నారు. కడప గౌస్‌ నగర్‌లోని మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఉర్దూ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం, నోట్‌బుక్స్‌, టెక్స్‌బుక్స్‌ మంగళవారం పంపిణీ చేశారు. ఖాదర్‌బాషా మాట్లాడుతూ పిల్లలు బాగా చదివి విద్యావంతులై అబ్దుల్‌ కలాం అడుగుజాడల్లో నడిచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పదో తరగతి వరకూ ఉండడంతో దాతలు పాఠశాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జుబేర్‌ అహ్మద్‌, ఖాదర్‌బాషా, ప్రవీణ్‌కుమార్‌ రెడ్డి పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంతో మొక్కలకు పోషకాలు



మాట్లాడుతున్న ఏఓ సురేష్‌కుమార్‌రెడ్డి



అవగాహన కల్పిస్తున్న ఏఓ సరస్వతి

కడప అగ్రికల్చర్‌: జీవన ఎరువుల వాడకంతో మొక్కలకు పోషకాలు అందడంతోపాటు నేల ఆరోగ్యంగా ఉంటుందని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. పొలంపిలుస్తోంది కార్యాక్రమంలో భాగంగా కడప మండలంలోని పాత కడప, మోడమీదిపల్లె గ్రామాల్లో మంగళవారం గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలసాగుకు ముందు ఖచ్చితంగా రైతులు భూసార పరీక్షలను చేయించుకోవాలన్నారు. భూసార పరీక్షల ఫలితాల మేరకు అవసరమైన జీవ నియంత్రణ కారకాలైన ట్రైకోడెర్మావిరిడి, సుడోమోనాస్‌, జీవన ఎరువుల వాడితే భూమి దెబ్బతినకుండా ఉంటుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఈకేవైసీ పూర్తిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దస్తగిరి, మోహరాజ్‌, రైతులు పాల్గొన్నారు.

కమలాపురం : రైతులు తాము సాగు చేసుకునే పంట పొలాల్లో సాగుకు ముందు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని చదిపిరాళ్ల, రామ చంద్రాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలు తదితర అంశాలపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు.

భూసార పరీక్షలు తప్పని సరిగా చేయాలని, తద్వారా తగిన వెతాదులో ఎరువులు వాడటంతో పాటు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే విత్తన శుద్ధి చేయడం వలన పైరుని తొలిదశలో వైరస్‌ తెగుళ్లు, రసం పీల్చే పురుగుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విత్తన శుద్ధి చేసేందుకు బీజామృతం తయారీని డెమో ద్వారా తెలియజేశారు. జిగురు అట్టలు, లింగాకర్షక బుట్టల వాడకము, కషాయాల తయారీ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్‌ గాయత్రి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.